


# లెక్క

యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక !

**మూలవాక్యము:-** **దాని 5:24,25** కావున ఆయన యెదుట నుండి ఈ యరచేయి వచ్చి ఈ వ్రాతను వ్రాసెను; వ్రాసిన శాసనమేదనగా, మెనే మెనే టెకేల్ ఉఫర్సీన్. ఈ వాక్య భావమేమనగా, **మినే అనగా దేవుడు నీ ప్రభుత్వ విషయంలో లెక్క చూచి దాని ముగించెను.**

**హెబ్రీ 4:13** మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. **మనమెవనికి లెక్క ఒప్ప చెప్పవలసి యున్నదో,** ఆ దేవుని కన్నులకు సమస్తము మరుగులేక తేటగా యున్నది.

**దేవుడైతే లెక్క చూసి ముగిస్తాడు. మరి మనమైతే లెక్క ఒప్పచెప్పవలసిన వారమై ఉన్నామని వాక్య సెలవిస్తుంది. మరి మనం ఏయే విషయాల్లో లెక్క ఒప్పచెప్పాలో వాక్యంలోనుండి చూద్దాం.**

## I. ఎవరు లెక్క అప్ప చెప్పాలి?

**ప్రతివాడు తన్ను గురించి లెక్క ఒప్ప చెప్పాలి: రోమా 14:12** అని వ్రాయబడియున్నది గనుక మనలో ప్రతివాడును తన్నుగురించి దేవునికి **లెక్క** యొప్పగింపవలెను.

## II. దేని గురించి లెక్క ఒప్ప చెప్పవలెను?

1. **అడుగుల లెక్క: యోబు 31:37 నా అడుగుల లెక్క ఆయనకు తెలియజేసెదను, రాజు వాలే నేనాయన యొద్దకు వెళ్లెదను.**

   **భక్తుడు యోబు చెప్పుతున్నాడు "నా అడుగుల లెక్క నేను ఆయనకి తెలియజేస్తా అని. అంత ధైర్యంగా మనం మన అడుగుల లెక్క చెప్పగలమా? మన అడుగుల ఎన్ని దేవుని వైపు పడుతున్నాయి? ఎన్ని లోకాశల మీద పడుతున్నాయి? మనం లెక్కిస్తే దేవుని కోసం చాలా తక్కువ అడుగులు వేసిన వారముగా ఉన్నాము.**

2. **మాటకు లెక్క: మత్తయి 12: 36** నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు **వ్యర్థమైన ప్రతి మాటనుగూర్చియు** విమర్శదినమున **లెక్క** చెప్పవలసియుండును.

   **అనేక సందర్భాలలో మనం ఎన్నో వ్యర్థమైన మాటలు పలికి ఉన్నాం. ఉంటున్నాం. ప్రియ సంఘమా, దేవుని మాటలు మాటలాడాల్సిన మనం ఏమేమో మాట్లాడుతున్నాం. ఈ ధోరణి మార్చుకుందాం.**

3. **గృహ నిర్వాహకత్వపు లెక్క: లూకా 16:2.** అతడు వాని పిలిపించి నిన్ను గూర్చి నేను వినుచున్న యీ మాట ఏమిటి? నీ **గృహనిర్వాహకత్వపు లెక్క** అప్పగించుము; నీవు ఇక మీదట గృహనిర్వాహకుడవై యుండవల్ల కాదని వానితో చెప్పెను.




మనం అందరం మన మనం గృహాల్లో ఏదో ఒక పాత్ర అనగా తండ్రిగానో/ తల్లిగానో/ అన్నగానో/ తమ్ముడిగానో/ చెల్లిగానో/ అక్కగానో/ పాత్ర పోషిస్తుంటాం. తండ్రిగా కొన్ని బాధ్యతలు ఖచ్చితంగా నెరవేర్చాలి. ఇలాగే మిగిలిన పాత్రల్లో కూడా అలాగే దేవుని గృహంలో కూడా మన మన పాత్రలు మనం పోషించాలి. దేవుడు రెండు గృహాలు అనగా ఆత్మీయ గృహంలో నీ పాత్ర భౌతికపరమైన మన గృహంలో నీ పాత్ర రెండు లెక్క చూస్తాడు.

4. **తలాంతులకు లెక్క: మత్తయి 25:19** బహు కాలమైన తరువాత ఆ దాసుల యజమానుడు వచ్చి వారి యొద్ద **లెక్క** చూచుకొనెను.

**దేవుడు మనకిచ్చిన తలంపులను మనం సరిగా ఉపయోగించాలి. పరిచర్యలో నీ తలంపులను విరివిగా వాడుకోవాలి. ఎందుకంటే మన తలాంతులకు కూడా దేవుడు ఒక రోజు లెక్క అడుగుతాడు.**

5. **క్షమాపణకు లెక్క: మత్తయి 18:23** కావున పరలోకరాజ్యము, తన దాసుల యొద్ద **లెక్క** చూచుకొనగోరిన యొక రాజును పోలియున్నది.

**మనం పరలోక ప్రార్థన చేసేటప్పుడు మా యెడల అపరాధము చేసిన వారని మేము క్షమించియున్న ప్రకారం, మా అపరాధములను క్షమించుము అంటున్నాం. మరి నిజంగా మనం మన యెడల తప్పులు చేసిన వారిని క్షమిస్తున్నామా? ఈ వృత్తాంతం చుస్తే ఒక యజమానుడు, తనకు అప్పు ఉన్న ఒక దాసుని 10000 తలాంతులు అనగా దాదాపు 36 కోట్లు రూపాయలు అప్పు కొట్టివేస్తే, వాడు మాత్రం మరియొక దాసును 50 రూపాయల అప్పు చెల్లించమని పీడిస్తున్నాడు. మరి మనం ఎలా ఉన్నాం?**
**ఇతరులని క్షమించే గుణం కలిగి ఉంటే దేవుడు కూడా మన తప్పుల్ని కూడా విస్తారంగా క్షమిస్తాడు.**

6. **సొమ్ము సోదా చూడబడును. ఓబద్యా 1:6** ఏశావు సంతతి వారి సొమ్ము సోదా చూడబడును; వారు దాచి పెట్టిన ధనమంతయు పట్టబడును.

I. **నాయకులు లెక్క ఒప్పచెప్పవలసి ఉన్నారు: హెబ్రీ 13:17** మీపైని నాయకులుగా ఉన్న వారు **లెక్క** ఒప్పచెప్పవలసిన వారి వలె మీ ఆత్మలను కాయుచున్నారు; వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడియుండుడి.

**నాయకులు ఆత్మలను గూర్చి లెక్క ఒప్పచెప్పాలి. కాబట్టి మనం మన నాయకులు christans గా ఉండాలని ప్రార్థన చేయాలి. లేకపోతే వాళ్లు దేవుని సన్నిధిలో లెక్క ఒప్ప చెప్పవలసి వస్తుంది. కాబట్టి దీన్ని మన బాధ్యత వహించి మనం నాయకుల గురించి ప్రార్థించాలి.**

II. **హత సాక్షుల లెక్క: ప్రకటన 6:11.** తెల్లని వస్త్రము వారిలో ప్రతివానికియ్యబడెను; మరియు వారి వలెనే చంపబడబోవు వారి సహదాసుల యొక్కయు సహోదరుల యొక్కయు లెక్క పూర్తియగు వరకు ఇంక కొంచెము కాలము విశ్రమింపవలెనని వారితో చెప్పబడెను.

ఈ మధ్యకాలంలో చాలామంది చెప్పుతున్న మాట ఏంటంటే మనం రెండోరాకడకు సమీపంలో ఉన్నామని. సిద్ధపడమని. మరి మనం సిద్ధపడుతున్నామా? అని అడిగితే చాలా మంది చెప్పే సమాధానం నేను సిద్ధపదియున్నాను, ఎత్తబడే సంఘంలో నేను ఉంటానని ఘనంగా చెప్పుకుంటున్నారు. మరి దేవుడు ఎలా సిద్ధపాడమని చెబుతున్నాడో తెలుసా? హత సాక్షివి కమ్మని ఆయన హత సాక్ష్యుల లెక్క కోసం ఎదురు చూస్తున్నారు. మరి దేవుని రాకడ కోసం ఎదురుచూడడం అంటే మనం హతసాక్షికి అవడానికి సిద్ధపడాలి. అలా సిద్ధపడడానికి దేవుడు మనకు సహాయము చేయును గాక.

III. **పరలోక రాజ్యములో చేరువారి లెక్క:** ప్రకటన 7: 4 ,9 మరియు ముద్రింపబడినవారి **లెక్క** చెప్పగా వింటిని ఇశ్రాయేలీయుల గోత్రములన్నిటిలో ముద్రింపబడిన వారు లక్ష నలుబది నాలుగు వేల మంది. అటు తర్వాత నేను చూడగా ఇదిగో ప్రతి జనములో నుండియు, ప్రజలలో నుండియు, ఆయా భాషలు మాట్లాడు వారిలో నుండియు వచ్చి ఎవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము కనబడెను.

**లెక్కకు మించినవి రెండు గలవు:-**

1. **లెక్కకు మించిన తలంపులు : కీర్తన 40:5** యెహోవా నా దేవా, నీవు మా యెడల జరిగించిన ఆశ్చర్యక్రియలును మాయెడల నీకున్న తలంపులును బహు విస్తారములు.వాటిని వివరించి చెప్పెదననుకొంటినా అవి **లెక్క**కు మించియున్నవి నీకు సాటియైనవాడొకడును లేడు.

దేవునికి మనపట్ల లెక్కలేనన్ని తలంపులు ఉన్నాయి. మరి మనపట్ల ఎన్ని తలంపులు ఉన్నాయి? మహా అయితే ఒక పదో, ఇరవయ్యో ఉంటాయి. ఉదాహరణకి ఒకడికి ఉన్న తలంపులు చూస్తే 1. మంచి భార్య/భర్త 2. మంచి ఉద్యోగం. 3. మంచి ఇల్లు 4. ఎక్కువ bank balance. 5. పిల్లలు....... ఇంతకంతే చెప్పమంటే ఆలోచిస్తారు. ఎందుకంటే మనపట్ల మనకు లెక్కలేనన్ని తలంపులు లేవు. మరి దేవునికి అయితే మనపట్ల లెక్కలేనన్ని తలంపులు. మనం పిండంగా రూపింపబడక మునుపే ఆయనకి మన పట్ల శ్రద్ధ. అది ఆయన ప్రేమ.

మరి మన దగ్గర ఉన్న కూడా కొన్ని లెక్కకి మించి ఉన్నాయి. అవి ఏంటో వాక్యంలో చూద్దాం.

2. **లెక్కకు మించిన దోషములు.: కీర్తన 40:12** లెక్కలేని అపాయములు నన్ను చుట్టుకొనియున్నవి నా దోషములు నన్ను తరిమి పట్టుకొనగా నేను తల యెత్తి చూడలేకపోతిని లెక్కకు అవి నా తలవెంద్రుకలను మించియున్నవి నా హృదయము అధైర్యపడి యున్నది.

లెక్కకు మించిన దోషములు. మరి ప్రియ సహోదరీ, సహోదరుడా మన దోషములను/పాపముల కోసమే యేసయ్య కల్వరి సిలువలో తన నిర్దోషమైన రక్తం కార్చి మనకు విమోచన, విడుదల కల్పించారు. ఎందుకంటే నిన్ను ఆయన తనతో కూడా నిత్యం ఉంచుకోవాలని యేసయ్య వెలపెట్టి నిన్ను కొనియున్నాడు. అది ఆయన లెక్క.